
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఆగస్టు 2024

అజ్ఞాత వ్యక్తుల ఫోన్ బెదిరింపులు

ఏయ్..! అప్పు ఎప్పుడు తీరుస్తావ్ ?



- ఒక్కో నంబర్ నుంచి ఒక్కొక్కరికి దబాయింపు
- బూతులతో విరుచుకుపడుతున్న దుండగులు
- పది రోజులుగా హడలిపోతున్న వద్దిరెడ్డిపల్లి గ్రామస్థులు
- తాము అప్పే తీసుకోలేదంటున్న బాధితులు

గాండ్లపెంట, ఆగస్టు 3: ఏమయ్యా..! అప్పు ఎప్పుడు తీరుస్తావ్? నీ అప్పు రూ. పది లక్షలు ఉంది. ఇంకా ఎన్నిరోజులు గడువు ఇవ్వాలా? అని ఫోన్‌లో అవతలి వ్యక్తి హూంకరిస్తుంటే పల్లె జనాలు బెదిరి పోతున్నారు. ధైర్యం కూడదీసుకుని తాము ఎవరి దగ్గర అప్పు తీసుకోలేదని చెబితే అవతలి నుంచి బండబూతులు తిడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెంబర్లు మారుస్తూ ఒక్కొక్కరికి ఒక్కోరకంగా ఫోన్ చేసి బూతులుతిడుతున్నారని మండలంలోని వద్దిరెడ్డిపల్లి గ్రామస్థులు వాపోతున్నారు. గత పది రోజుల నుంచి ఫోన్‌కాల్స్‌తో బెంబేలెత్తిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పల్లెలో రూ.లక్ష అప్పు అంటేనే గొప్ప

సాధారణంగా పల్లెల్లో గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు అప్పుగా తీసుకుంటుంటారు. కనీసం పక్కింటివారికి తెలిసినా ఎక్కడ పరువుపోతుందోననే ఆందోళన పల్లె ప్రజలను పీడిస్తుంటుంది. అందుకే ఓ పూట



ఫోన్‌కాల్స్ వస్తున్నాయని ఆవేదన చెందుతున్న బాధితులు

తిన్నా తినకపోయినా సరే చెప్పిన సమయానికి వడ్డీతో అప్పు తీర్చేస్తుంటారు. గ్రామాల్లో పంట పెట్టుబడికి, పిల్లల చదువుల కోసం కొద్దోగొప్పో పొదుపు సంఘాల ద్వారా, బ్యాంక్‌లో పాడిపశువుల మీద రుణాలు తీసుకుంటున్నారు. అంతాఅయినా రూ.లక్షకు మించి అప్పు చేయడానికి భయపడతారు. అలాంటిది గ్రామంలో ప్రతి కుటుంబం రూ. ఐదు లక్షల నుంచి రూ.15 లక్షలు రుణాలు తీసుకున్నారని, ఎప్పుడు చెల్లిస్తారంటూ ఫోన్‌కాల్స్ వస్తుంటే బెదిరిపోతున్నారు. ఒక్కో బాధితుడికి ఒక్కో నెంబర్‌తో ఫోన్ చేసి కుటుంబసభ్యుల ఫోన్‌నెంబర్లు, ఆధార్ నెంబర్లు, కుటుంబ సభ్యుల పేర్లు, ఖాతా నెంబర్లు చెబుతుంటే హడలెత్తిపోతున్నారు. ఈఫోన్ కాల్స్ హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి చేస్తున్నామని చెబుతున్నారు. ఫోన్‌కాల్స్‌లో ఏబ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారో కూడా చెప్పడం లేదు. తిరిగి ఫోన్ చేస్తే ఆ నెంబర్లు పనిచేయడంలేదని గ్రామస్థులంటున్నారు. 8925009553, 9384775289, 9940247231, 8940477673, 7708291534 నుంచేకాకుండా మరికొన్ని నెంబర్లనుంచి కాల్స్ వస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్ ఇంటివద్ద డబ్బులు చెల్లించండి

గత పది రోజులు నుంచి విపరీతంగా బెదిరింపు ఫోన్లు వస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. తీసుకున్న రుణం ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. తాము ఎలాంటి రుణం తీసుకోలేదని చెబితే బూతులు తిండుతూ వలంటీర్ జయకుమార్‌రెడ్డి, అతని తండ్రి సిద్దిరెడ్డి ఇంటి వద్దకు రండి మేము అక్కడున్నామంటూ కాల్ కట్ చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఈవిషయంపై వలంటీర్‌ను అడిగితే తనకు సంబధంలేదని, తాను ఎవరికి వివరాలు తెలపలేదని, గతంలో వలంటీర్‌గా పనిచేసే సమయంలో ప్రభుత్వానికి వివరాలు అందించానని, మరి ఎవరికి ఇవ్వలేదని వలంటీర్ చెబుతున్నారు.

సర్పంచ్‌కూ ఫోన్‌కాల్స్

గాండ్లపెంట సర్పంచ్ రహంతుల్లాను కూడా ఈ ఫోన్‌కాల్స్ వదలేదు. సర్పంచ్‌కు ఫోన్ చేసి రూ.14లక్షల రుణం తీసుకున్నానని, ఎప్పుడు చెల్లిస్తావని బెదిరిస్తున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారులకు కూడా ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని దుర్భాషలాడుతు న్నారని తెలిపారు.



ఫోన్‌కాల్ వస్తే హడల్

ఫోన్‌కాల్ వచ్చిందంటేనే హడలిపోతున్నాం. గత కొద్దిరోజులుగా పలు నెంబర్ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. మేము రూ. ఐదు లక్షల రుణం తీసుకున్నామని, ఎప్పుడు చెల్లిస్తారని, బూతులు తిడుతున్నారు. రుణం చెల్లించలేకపోతే హైదరాబాద్‌లోని హోటళ్ల పని చేసి అప్పు తీర్చండి అని సలహాలిస్తున్నారు.

- రాజమ్మ, వద్దిరెడ్డిపల్లి



మా ఆధారాలు వలంటీర్‌కే ఇచ్చాం

మాకు సంబంధించిన ఆధారాలు కేవలం గ్రామ వలంటీర్లకు మాత్రమే అందజేశాం. ఇంకెవరికీ ఇవ్వలేదు. ఎక్కడా అప్పు కూడా తీసుకోలేదు. అప్పటిలో మా ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నెంబర్, కుటుంబ, భూముల వివరాలతోపాటు ఇతర వివరాలను కేవలం గ్రామ వలంటీర్‌కే అందించాం. ప్రస్తుతం ఫోన్ చేస్తున్న వ్యక్తులకు మా వివరాలు ఎలా తెలిశాయో అర్థం కావడం లేదు. నంటూ ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఫోన్లు చేస్తూ వేధిస్తున్నారు. ఫోన్ ఎత్తికపోతే నెంబర్లు మార్చి మార్చి చేస్తున్నారు. మా కుటుంబ సభ్యుల పేర్లతో నానా దుర్భాషలాడంతో, పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదు.

- శంకర్‌రెడ్డి, వద్దిరెడ్డిపల్లి

- బెదిరింపు ఫోన్ కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ శ్రీలత సూచించారు. ఎస్ఐ అందుబాటులో లేరని, సీఐకి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అమ్మ రాజీనామా

పింఛన్ సొమ్ము కోసం కొడుకుల ఒత్తిడి.. బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లేపాక్షి, ఆగస్టు 3: కూలి, నాలి చేసి కొడుకులిద్దరిని పెంచి పెద్ద చేసింది. పెళ్లిల్లు చేసింది. అంతో ఇంతో సంపాదించిన సొమ్మును ఇద్దరు బిడ్డలకు ఇచ్చేసింది. ముసలి వయసులో వారికి భారమెందుకని భర్త లేకున్నా వేరుగా ఉంటోంది. వయసు మీద పడిన ఒంట్లోని సత్తువనంతా కూడదీసుకుని కూలి పనులకెళ్తోంది. ఇలాంటి మహిళలను ఆదుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛను ఇస్తోంది. ఆ పింఛన్ సొమ్మే ఆమెను తనకు తానే మరణశాసనం రాసుకునేలా చేసింది. నెలకోసారి వచ్చే పింఛన్ కోసం కొడుకుల్దిరూ ప్రతిసారీ నాకంటే నాకే ఇవ్వాలంటూ ఆ వృద్ధురాలిపై ఒత్తిడి తెచ్చేవారు. ముదిమి వయసులో తనకు ఆసరాగా ఉండి పట్టెడన్నం పెట్టాల్సిన బిడ్డలిద్దరూ సొమ్ముల కోసం ఇంకా తనపై ఒత్తిడి తేవడాన్ని భరించలేకపోయింది.





నరసమ్మ(ఫైల్), వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న బావి ఇదే..

ఈ జీవితానికి 'రాజీనామా' అంటూ ఊరి చివరన ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

ఈ సంఘటన లేపాక్షి మండలం కంచిసముద్రం గ్రామంలో శనివారం వెలుగు చూసింది. పింఛన్ డబ్బుల కోసం కొడుకుల ఒత్తిడి తాళలేక గ్రామానికి చెందిన దళిత నరసమ్మ(65) మనస్తాపం చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. శనివారం మృతదేహం పైకి తేలడంతో వీఆర్ఓ గంగరత్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముద్రా రుణాలపై సమావేశం

ధర్మవరం, ఆగస్టు 3: చేనేత కార్మికులకు ముద్రా రుణాల మంజూరు పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హ్యాండ్‌లూమ్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశాన్ని న్విహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, హ్యాండ్ లూమ్ ఏడీ రమేశ్ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. చేనేత కార్మికులకు ముద్రారుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు వెళ్లి అధికారులతో మాట్లాడామన్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలపై కూడా మాట్లాడామన్నారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంప్యూటరైజేషన్, కొత్తసంఘాల ఏర్పాటు తదితర వాటి గురించి చర్చించామన్నారు. రాంనగర్‌లో పవర్‌లూమ్స్ వల్ల శబ్దం అధికంగా ఉందని, దీని వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు నరసయ్య, వరదరాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌డీడీ రాజారావు అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరించారు. సమావేశంలో హ్యాండ్‌లూమ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజారావు

ప్రజా పంపిణీ వ్యవస్థను

పటిష్ట పరచాలి: జేసీ



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి, ఆగస్టు 3: జిల్లాలో అమలవుతోన్న ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో నిత్యావసర సరుకుల సరఫరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రేషన్ షాపుల్లో కచ్చితమైన తూకాలతో సరుకులు పంపిణీ జరిగేలా చూడాలన్నారు. నెల ప్రారంభమైన తొలి 15రోజుల వరకు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ, సంక్షేమ హాస్టళ్లకు ప్రతినెలా 30 లోపల రాబోవు నెలకు సంబంధించిన రేషన్‌ను అందచేయాలన్నారు. బహిరంగ మార్కెట్లలో కందిపప్పు రూ.150, సోనా మసూరి బియ్యం రూ.48 అందించాలంటూ ఆదేశించారు. అనంతరం గోదాముల్లో నిల్వ ఉంచిన 3227.21 క్వింటాళ్ల బియ్యాన్ని వేలం వేశారు. సోమవారంలోపు మొత్తం డబ్బు చెల్లించి బియ్యం తీసుకెళ్లాలంటూ వేలంపాడినవారిని జేసీ ఆదేశించారు. అనంతరం ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, డీఎం అశ్వత్థ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఇంటిపై వైసీపీ సర్పంచ్ దాడి

గోరంట్ల, ఆగస్టు 3: మండలంలోని వడ్డిపల్లిలో టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నిడిమామిడప్ప ఇంటిపై రెడ్డిచెరువుపల్లి సర్పంచ్, వైసీపీ నాయకుడు వినోద్‌కుమార్ తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. రెడ్డిచెరువుపల్లి పంచాయతీకి సంబంధించి 2020నుంచి ఇప్పటివరకు 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధుల వివరాలు, చేపట్టిన పనుల గురించి, పంచాయతీ సాధారణ నిధులు, వాటి వ్యయం పూర్తి వివరాలను తెలియచేయాలని మాజీ సర్పంచ్ నిడిమామిడప్ప సమాచారహక్కు చట్టం ద్వారా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ వినోద్‌కుమార్ తన అనుచరులతో కలిసి నిడిమామిడప్ప ఇంటిపై శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మారణాయుధాలతో వెళ్లి రాళ్లతో దాడి చేశాడు. గ్రామంలోని ఇంటి ముందు నిడిమామిడప్ప, ఆయన భార్య చంద్రకళ నిద్రిస్తుండగా రాళ్లదాడి జరిగింది. అప్రమత్తమై ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నట్లు బాధితుడు పోలీసులకు తెలిపారు. కొడవళ్లు, రాడ్లతో దాడికి పాల్పడుతూ చంపడానికి ప్రయత్నిస్తూ దుర్భాషలాడినట్లు బాధితులు తెలిపారు. వెంటనే 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. అయితే అప్పటికే దుండగులు పరారయ్యారు. రాళ్లు తగలడంతో నిడిమామిడప్ప భార్య చంద్రకళ స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు సర్పంచ్ వినోద్ కుమార్, అనుచరులు చంద్ర, రఘు, శ్రీనివాసులు, వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోరంట్ల పోలీసులు తెలిపారు.

చేనేతకు పూర్వవైభవం తెస్తాం

చేనేతల సమావేశంలో పరిటాల శ్రీరామ్



చేనేతలతో మాట్లాడుతున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఆగస్టు 3: చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకు వస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన చేనేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హ్యాండ్‌లూమ్ చేనేత కార్మికులు మాట్లాడుతూ ముడిసరుకుల ధరలు పెరిగిపోయాయని, పవర్‌లూమ్స్ వల్ల మరింత గిరాకీ తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా చేనేతలు ఈ సమస్యలు తన దృష్టికి తీసుకువస్తునే ఉన్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల చేనేతలకు అన్యాయం జరిగిందన్నారు. హ్యాండ్‌లూమ్‌ను పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ధర్మవరంలో నేతన్నలే పట్టుచీరలను రిటైల్‌లో అమ్ముకునేందుకు ప్రత్యేక వసతిని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. చేనేతలకు నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇప్పించి మెరుగైన పట్టు చీరల తయారీకి అవకాశాలు పరిశీలిస్తామన్నారు. ధర్మవరం పట్టుచీరలకు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా మార్కెటింగ్ అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. త్వరలోనే చేనేత సమస్యలను మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్, సవితల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించకుందామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కమతంకాటమయ్య, పరిశే సుధాకర్, బీరే గోపాలక్రిష్ణ, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, సందా రాఘవ, జింకా పురుషోత్తం, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, కొత్తపేట ఆది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్టులను నమోదు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 3: ఇన్‌స్పైయిర్ మనక్ నామినేషన్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను సెప్టెంబరు 15లోగా నమోదు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి శనివారం తెలిపారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆమె విద్యాశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నతపాఠశాలలు ఐదు నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాలలు 2 నుంచి 3 నామినేషన్లు వేయాలన్నారు. ఈ ప్రక్రియ జూన్ 1 నుంచి ప్రారంభమైందని సెప్టెంబరు 15తో ముగుస్తుంద న్నారు. విద్యార్థులు మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్, ఆరోగ్యభారత్, వినూత్న ఆవిష్కరణల విభాగాలలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీ-1 నాగరాజు, ఏడీ-2 రామకృష్ణ, ఏడీ-3 లాజర్, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఆఫీసు సూపరింటెండెంట్ ప్రసాద్, సీఎంఓ అబ్దుల్‌మాలిక్ పాల్గొన్నారు.

అత్యాచారం చేసే హత్యచేశాడు

పోస్టుమార్టం నివేదికతో స్పష్టత

హిందూపురం, ఆగస్టు 3: కూతురు వరుస అయ్యే చిన్నారిని హత్య చేసేందుకు ముందు ఉన్మాది గంగాధర్. ఆమెపై అత్యాచారం జరిపినట్లు తేలింది. హిందూపురం మండల పరిధిలోని తూముకుంటలో శుక్రవారం హత్యకు గురైన చిన్నారికి వైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. ఆ నివేదిక ప్రకారం చిన్నారిపై అత్యాచారం జరిగినట్లు స్పష్టమైందని డీఎస్పీ కంజక్షన్ శనివారం తెలిపారు. మృతదేహానికి కుటుంబ సభ్యులు శనివారం అంత్రక్రియలు నిర్వహించారు. నిందితుడిపై అత్యాచారం, హత్య కేసులను నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని అన్నారు.

శ్రావణ శోభ

ఆంజనేయస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు

కసాపురం, మురడి, నేమకల్లులో సందడి

రేపటి నుంచి వేడుకలు ఆరంభం

గుంతకల్లు/డి.హీరేహాళ్/బొమ్మనహాళ్, ఆగస్టు 3: శ్రావణ మాసోత్సవాలకు ఆంజనేయ స్వామి ఆలయాలు సిద్ధమవుతున్నాయి. ప్రత్యేకంగా కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలకు ఈ మాసంలో భక్తులు పోటెత్తుతారు. అందుకు అనుగుణంగా ఆలయ అధికారులు, దేవదాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నాయి. హనుమాన్ భక్తులు ఎంతో పవిత్రంగా భావించే శ్రావణ మాసం సోమవారం నుంచి మొదలవుతుంది. నెలరోజులపాటు అన్ని శని, మంగళవారాల్లో ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లాలో విజయ నగర రాజుల వంశీకుడు వ్యాస రాయలచే ప్రాణ ప్రతిష్ఠ పొందిన కసాపురం, మురిడి, నేమకల్లు ఆంజనేయ స్వామి మూల విరాట్టులను భక్తులు శ్రావణ మాసంలో ఒకే రోజు దర్శించుకుంటారు. ఈ శ్రావణ మాసంలో నాలుగు శని, ఐదు మంగళవారాలలో ఉత్సవాలను నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లను చేపట్టారు. శనివారాల్లో స్వామివారికి వాహనోత్సవాలను, మంగళ వారాల్లో ప్రత్యేక అలంకారాలు, వెండి రథోత్సవాలను నిర్వహిస్తారు.



మురడి ఆలయంలో..

శ్రావణ మాసోత్సవాల కోసం మురడి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సిబ్బంది, ఎంపీటీసీ గంగాధర ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వీఐపీ, సర్వదర్శనాలకు, ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బారికేడ్లు ఏర్పాటు చేయించారు. భక్తులకు అన్న ప్రసాదం కోసం ఏర్పాట్లు చేశారు.



శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



కసాపురంలో...



ఈ నెల 10న శ్రావణ మాస మొదటి శనివారాన్ని పురస్కరించుకుని స్వామివారికి శేష వాహనోత్సవం నిర్వహిస్తారు. 17వ తేదీ రెండో శనివారం హనుమంత వాహనోత్సవం, 24వ తేదీ మూడో శనివారం గజవాహనోత్సవం, 31వ తేదీ నాలుగో శనివారం గరుడ వాహనోత్సవం నిర్వహిస్తారు. మంగళవారాలలో స్వామివరికి అలంకారాలు, సాయంత్రం వెండి రథ ప్రాకారోత్సవాలను నిర్వహిస్తారు. ఉత్సవ రోజుల్లో స్వామివారి మూల విరాట్టుకు వజ్రకవచాలంకరణ చేస్తామని ఈఓ భద్రాజీ తెలియజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు విడిది, భోజనం, తాగునీరు, వైద్య సేవలను కల్పిస్తామని తెలిపారు. సాధారణంగా మూడు, నాలుగు శనివారాలలో దేవస్థానానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. తొక్కిసలాట జరక్కుండా వలంటీర్లను ఏర్పాటు చేశారు..



నేమకల్లులో అసౌకర్యాలు

ఈ నెల 5 నుంచి ఉత్సవాలు ప్రారంభమై.. నెల రోజుల పాటు కొనసాగుతాయి. కానీ నేమకల్లు ఆలయంలో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు అన్నదాన సత్రం ప్రాంగణంలో రాత్రి బస చేస్తారు. మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేవు. మహిళలు ఆరుబయటే స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవాల్సిన దుస్థితి ఉంది. ఏడాదికి రూ.50 లక్షలకుపైగా స్వామివారికి ఆదాయం వస్తుంది. అయినా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉత్సవాల నేపథ్యంలో మొబైల్ మరుగుదొడ్లు, స్నానపు గదులనైనా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు దేవదాయశాఖ అధికారులు పాలక మండలిని ఏర్పాటు చేయలేదు. ఇకనైనా పాలకమండలిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



నేమకల్లు ఆలయం

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు, ఆగస్టు 3: గుత్తి రైల్వేస్టేషన్ వద్ద వంతెన గిర్డర్లను మార్చే పనుల కారణంగా రెండు రైళ్లను రద్దు చేసి మరో రెండింటిని దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డోన్-గుత్తి-డోన్ డెము (నెం. 07289/90) రైలును ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు ప్యాసింజరు (నెం. 07693/94) రైలును ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కల్లూరు-గుత్తి-గుంతకల్లు రూటులో కాకుండా, కల్లూరు-గూళ్యపాళ్యం-గుంతకల్లు రూటుకు మళ్లించడం జరిగిందన్నారు. ఈ కారణంగా నాలుగురోజులపాటు పామిడి, తురకపల్లి, గుత్తి, పాత కొత్తచెరువు, నక్కనదొడ్డి, తిమ్మనచెర్ల స్టేషన్ల మీదుగా ఈ ప్యాసింజరు రైలు వెళ్లదని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 3: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 2400 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,700లు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.11,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం గా 748టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బిస్కెట్ గోడౌన్‌లోకి ఎలుగుబంటి

భయాందోళనలో కాలనీవాసులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 3: పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా వున్న బిస్కెట్ ఏజెన్సీ నిర్వాహకుడు కరణం రాఘవేంద్ర గోడౌన్‌లోకి శుక్రవారం రాత్రి ఎలుగుబంటి చొరబడింది. బిస్కెట్ బాక్స్ చించివేసి బిస్కెట్లను తింటున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. రెండవసారి ఎలుగుబంటి కాలనీలోకి రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నా రు. అటవీ శాఖ అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.



బిస్కెట్ గోడౌన్‌లో ఉన్న ఎలుగుబంటి

బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం, ఆగస్టు 3: కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ చెంద్రాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కోఆర్డినేటర్ రాధాకుమారి నంద్యాలకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో చెంద్రాయుడును నియమించారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రిన్సిపాల్ శాస్త్రవేత్తగా పనిచేస్తూ కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రానికి బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తామని పేర్కొన్నారు.



చంద్రాయుడు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 3: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపారనిర్వహణపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ శనివారం తెలిపారు. వివరాలకు 7981541994ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 3

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు సూచించారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలు, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ మెట్ట పంటలను పరిశీలించారు. అనంతరం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాభావపరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగుచేయాల్సిన పంటలపై చర్చించారు. అదేవిధంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు కల్పించాల్సిన అవగాహనపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌శంకర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో కంది, జొన్న, కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, ఆముదం, పెసర పంటలను వేసుకోవచ్చన్నారు. నల్లరేగడి భూముల్లో కంది, ఆముదం, పత్తి ఆగస్టు 10వ తేదీ వరకు విత్తుకోవచ్చని సూచించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు గుత్తానారాయణస్వామి, లక్ష్మణ్, భార్గవి, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలను బెంగళూరుకు చెందిన టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం బెంగళూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంత ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు తదితరులను సన్మానించారు.



సన్మాన సభకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు

ఉద్యాన పథకాలను వాడుకోండి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో అమలు చేస్తున్న ఆర్కేవీవై, ఎంఐడీహెచ్ పథకాలను జిల్లాలోని ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు టీఎస్ చేతన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యాన పంటలైన మామిడి, చీనీ, దానిమ్మ, జామ, నేరేడు, ఉసిరి, డ్రాగన్‌ఫ్రూట్, అంజూర, చింత, సీతాఫలం, విడిపూలసాగు, హైబ్రీడ్ కూరగాయల పండ్లతోటల పెంపకానికి 40% సబ్సిడీతో మొక్కలు అందజేస్తామన్నారు. తమ పొలాల్లో ఫారం పాండు నిర్మించుకునే రైతుల యూనిట్‌పై 50% రాయితీ అందిస్తారన్నారు. వ్యక్తిగత ఫారంపాండు, కమ్యూనిటీ ఫారంపాండు, ప్యాక్‌హౌస్ నిర్మాణం, ఉద్యాన యాంత్రీకరణ, మినీట్రాక్టర్, ట్రాక్టర్‌కు అనుసంధినించు పిచికారీ యంత్రం, తైవాన్ స్ప్రేయర్, రక్షిత వ్యవసాయం, పాలీహౌసులు, షేడ్ నెట్ హౌసులు, పందిరి వ్యవసాయం, ఎఫ్‌పీఓ సంఘం ఏర్పాటు చేయడం, 40% సబ్సిడీతో తేనేటీగల పెంపకం వంటి పథకాలు ఉంటాయన్నారు. వివరాలకు జిల్లా ఉద్యానశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంకా పాతదేనా?

కొత్త మద్యం కోసం ఎదురుచూపు
జేబ్రాండ్లతో మందుబాబుల ఇబ్బంది
ఫుల్‌గా స్టాక్ నింపిన పాత ప్రభుత్వం
అది అయిపోయే వరకు ఇదే గతి!
నిట్టూరుస్తున్న మద్యం ప్రియులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: రాష్ట్రంలో అధికారం మారినా ఇంకా జే బ్రాండ్లేనా అంటూ మందుబాబులు నిట్టూరుస్తున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నాణ్యమైన మద్యం లభిస్తుందని మద్యం ప్రియులు ఆశలు పెట్టుకున్నారు. అయితే నేటికీ గతంలో సరఫరా చేసిన నాసిరకం మద్యాన్నే విక్రయిస్తున్నారన్న విమర్శలు న్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ పాలకులు ముందస్తుగానే తమ బినామీ, అనుకూలమైన డిస్టిలరీస్ నుంచి భారీగా మద్యం కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అధికారం మారినా ఇప్పటికీ గతంలో విక్రయించిన నాసిరకం మద్యమే సరఫరా అవుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో భారీగా మద్యం కొనుగోలు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దాన్ని మద్యం దుకాణాలకు సరఫరా చేయాల్సి వస్తోందని తెలిసింది. ఇదే క్రమంలో మరి కొన్ని బ్రాండ్లను కల్తీ చేసి మద్యం తయారీదారులు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కొందరు మద్యం ప్రియులు ఎక్సైజ్ అధికా రులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిన్నట్లు సమా చారం. గత ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన నాసిరకం బ్రాండ్ల సరఫరాను ఆపేస్తే తప్ప నాసిరకం మద్యం విక్రయాలకు చెక్ పడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మచ్చుకు కొన్ని..

అనంతపురం నగరం కమలానగర్ బాషా హోటల్ సమీపంలోని ఓ మద్యం దుకాణంలో రెండు రోజుల క్రితం ఓ మద్యం ప్రియుడు ప్రముఖ మద్యం బ్రాండ్ ఆరంజ్ ఫ్లేవర్ ఫుల్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు. తన స్నేహితులతో కలిసి విందు చేసుకొనేందుకు బాటిల్‌ను ఓపెన్ చేయగా మద్యాన్ని కల్తీ చేసినట్లు స్మెల్ కొట్టింది. వాసనతో ఏముందిలే అని మద్యం తాగి చూస్తే గతంలో ఆరంజ్ ఫ్లేవర్ మందుతో పోలిస్తే ఇప్పటి మందును కల్తీ చేసినట్లు తేలిందని ఆ మద్యం ప్రియుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మరో మద్యం ప్రియుడు అనంతపురం శ్రీకంఠం సర్కిల్‌లోని మాల్‌లో ఒక రోజు కిందట ప్రసిద్ధి చెందిన బ్రాండ్ రెండు ఆఫ్ బాటిళ్లు కొనుగోలు చేశాడు. అదే రోజు తన స్నేహితులతో కలిసి మద్యాన్ని సేవించాడు. గతంలో దానికి దీనికి తేడా ఉన్నట్లు గుర్తించి మొత్తం మద్యాన్ని పారబోసినట్లు పేర్కొన్నాడు. జిల్లా వ్యాప్తంగా మద్యం ప్రియులందరు ఇదే చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. ఈ కల్తీ మద్యం తాగిన కొందరు ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నట్లు తెలిపారు.



అనంతపురం నగరంలో మద్యం కోసం క్యూ

అప్పటిదాకా ఇంతేనా..?

టీడీపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొత్త మద్యం పాలసీని అమలు చేయడంతోపాటు మద్యం టెండర్లు నిర్వహించేదాకా తమకు నాసిరకం మద్యం బాధలు తప్పవా అంటూ మద్యం ప్రియులు ప్రశ్ని స్తున్నారు. ప్రభుత్వం మారినా జే బ్రాండ్లు ఇంకా విక్రయిస్తుండటంతో కల్తీ మద్యం తాగలేక నానా అవస్థలు పడుతున్నామంటూ మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొత్త మద్యం పాలసీని అమలు చేయడంతోపాటు ప్రస్తుత డిస్టరీల నుంచి నాసి రకం మద్యం సరఫరా కా కుండా చూడాలిని మద్యం ప్రియులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదేశాల మేరకే..

కొత్త మద్యం పాలసీ అమలుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళతాం. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో మద్యం అమ్మకాలకు టెండర్లు లేదా లాటరీ తీసి టెండర్లు ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రస్తుతం గతంలో సరఫరా చేసిన మద్యం బ్రాండ్లే షాపులకు సరఫరా అవుతున్నాయి. గతంతో పోలిస్తే మద్యం ప్రియులు అడిగిన బ్రాండ్స్ అన్నింటినీ ప్రస్తుతం ఇస్తున్నాం. ఎప్పటి నుంచి కొత్త బ్రాండ్లు అందుబాటులోకి వస్తాయన్న విషయం తెలియాల్సి ఉంది.

- మధుసూదన్,
ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనంతపురం

బాలికల ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటుకు కృషి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ● జాతీయ పోటీల్లో ఏపీ జట్టు శుభారంభం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3: జిల్లాలో బాలికల ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలు శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌తో కలసి కలెక్టర్ వినోద్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలు నిర్వహణకు ఆర్డీటీ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్నాయన్నారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జగరడం సంతోషదాయకమన్నారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ క్రీడాకారులు, క్రీడల అభివృద్ధికి ఆర్డీటీ ముందుంటుందన్నారు. జిల్లాలో ఉన్న క్రీడావసతులు, వనరులను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన పోటీలో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రప్రదేశ్ విజయం సాధించి శుభారంభాన్ని అందుకుంది. మరో మ్యాచ్‌లో బీహార్ జట్టుపై జార్ఖండ్ విజయం సాధించింది. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డేనియల్ ప్రదీప్, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డైరెక్టర్ రావూరి రాజేష్, జిల్లా కార్యదర్శి కూడేరు మల్లేష్, రాజా, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్

పెట్టుబడి లేకుండా రైతులకు దిగుబడి

నాగజెముడు-బ్రహ్మ జెముడు పంటసాగుకు జిల్లా అనుకూలం

రాష్ట్ర వాటర్‌షెడ్ జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/గుత్తి రూరల్, ఆగస్టు 3: పెట్టుబడి లేకుండా రైతులకు అధిక దిగుబడి, లాభదాయకమైన పంటలను సాగుచేసేలా అవగాహన కల్పిస్తామని రాష్ట్ర వాటర్‌షెడ్ జాయింట్ కమిషనర్ శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లాకు వచ్చారు. డ్వామా పీడీ కార్యాలయంలో ఏపీడీ సుధాకర్‌రెడ్డితో కలిసి అధికారులతో మాట్లాడారు. అనంతరం గుత్తిమండలం ఊటకల్లులో రైతు వెంకటేశ్వర్‌రెడ్డి సాగు చేసిన బ్రహ్మజెముడు-నాగజెముడు పంటను పరిశీలించారు. అక్కడ నుంచి శింగనమల మండలం వెస్ట్‌నరసాపురంలో పర్యటించి పంటల సాగుపై తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాడి పశువుల దాణాకు, పశువులతో సంబంధం లేకుండా కృత్రిమంగా లెదర్ తయారీ, బయోగ్యాస్, మెడిసిన్స్‌కు నాగజెముడు-బ్రహ్మజెముడు ఉపయోగపడతాయన్నారు. ఈ పంట సాగుకు జిల్లా అనువైనదన్నారు. ఈ పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో పంట సాగు పద్ధతులు, మార్కెటింగ్ సౌకర్యాలపై అధ్యయనం చేయడానికే జిల్లాకు రావడం జరిగిందన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో ఇది భాగమని వివరించారు.



బ్రహ్మ జెముడు-నాగ జెముడు పంటను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి



తిరుమలలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే పల్లె సింధూర

పుట్టపర్తి, ఆగస్టు 3 : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటిసారి శ్రీవారి మెట్లు మార్గంలో కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఆమె వెంట మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, భర్త పీవీ క్రిష్ణకిశోర్‌రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకరరెడ్డి దంపతులు ఉన్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

తొలగిన మురుగు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 3: స్థానిక బీసీ కాలనీ, దిగువ కాలనీల్లో మురుగునీటి కాలువల్లో చెత్త పేరుక పోయింది. అంతేకాకుండా రహదారి మధ్యలోనే కాలువ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రహదారి మధ్యలో మురుగు అన్న కథనాన్ని ఆంధ్రజ్యోతి శనివారం ప్రచురించింది. స్పందించిన ఈఓఆర్డీ రాజశేఖర్, కార్యదర్శి రామలింగారెడ్డి మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను కార్మికులతో తొలగించారు. కాలువల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఈఓఆర్డీ తెలిపారు.



దాదాఖలందర్ మృతదేహం

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, ఆగస్టు 3: స్థానిక మార్కెట్ వీధికి చెందిన దాదా ఖలందర్ (35) శుక్రవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు ఇర్షాద్ అన్న. దాదాఖలందర్ శుభకార్యాలయాలకు డెకరేషన్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల భార్య నజియాతో కుటుంబ విషయంలో వాదులాడుకున్నారు. మనస్తాపానికి గురైన దాదా ఖలందర్ శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలోనే గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దాదాఖలందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు నాగూర్‌హుస్సేన్ ఉన్నారు.

అనారోగ్యంతో ఆర్టీసీ ఉద్యోగి...



రామచంద్ర (ఫైల్)

కొత్తచెరువు: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన బోయరామచంద్ర(50) అనారోగ్యంతో శనివారం ప్రశాంతి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో మెకానిక్. రెండేళ్ల క్రితం భార్య కుళ్లాయమ్మ చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇటీవలే గుండెకు సంబంధించిన ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందిన అతను ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు రాజేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వఆస్పత్రికి తరలించామని హిందూపురం రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు.

కడుపునొప్పితో వృద్ధురాలు ...

కదిరి అర్బన్ : కదిరి మండలం మొటుకుపల్లిలో కడుపు నొప్పితాళలేక తలుపుల లక్ష్మమ్మ (65) శనివారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తరచూ ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేంది. శనివారం కడుపు నొప్పి అధికం కావడంతో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోలీసులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

నంబులపూలకుంట, ఆగస్టు 3: మండల కేంద్రానికి సమీపంలో వంకమద్ది వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. శనివారం కదిరి నుంచి రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ముందు వెళ్తున్న ఓ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న గోవిందరాజులపల్లికి చెందిన ఇరగంరెడ్డి, మణికంఠరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే నంబులపూలకుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనంతసాగరంలో చోరీ

బత్తలపల్లి, ఆగస్టు 3: మండలంలోని అనంతసాగరంలో నారాయణ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. నారాయణ తన కుటుంబ సభ్యులతో కూలి పనులకు వెళ్లాడు. సాయంకాలం నారాయణ భార్య కొండమ్మ ఇంటికి రాగా.. ఇంటి తలుపుల తాళాలు బద్దలు కొట్టి ఉండటాన్ని గమనించి.. లోనికి వెళ్లి పరిశీలించారు. బీరవాను బద్దలు కొట్టి అందులోని 8 తులాల బంగారు, వెండి గొలుసులు, రూ. 50 వేల నగదు దుండగులు ఎత్తికెళ్లినట్లు గుర్తించింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

హనుమాన్ దర్శనానికి బస్సులు

ధర్మవరం, ఆగస్టు 3 : శ్రావణ మాసం సందర్భంగా హనుమాన్ దర్శనానికి ఈనెల ఆరో తేదీ నుంచి ధర్మవరం నుంచి బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సత్యనారాయణరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ధర్మవరం నుంచి మురడి, నేమకల్లు, కసాపురం ఆలయాల్లో ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31 తేదీల్లో బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. అంతేకాకుండా రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. పెద్దలకు రూ.580, పిల్లలకు రూ.300 చార్జీ అని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుకింగ్ కోసం 63031 51302ను సంప్రదించాలన్నారు.

నేడు చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవం

కదిరి అర్బన్, ఆగస్టు 3: పట్టణంలోని మదనపల్లి రోడ్డు వద్ద ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయంలో జయంత్యుత్సవాలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు మహాగణపతికి పంచామృతాభిషేకం, 6.45కు అమ్మవారికి పంచామృత రుద్రాభిషేకం, 7.45 నవగ్రహాలకు పంచామృతాభిషేకం, 8.30 గంటలకు అమ్మవారికి చక్ర, కుంకుమార్చన, 11గంటలకు ఉయ్యాలోత్సవం, 12 గంటలకు మహామంగళహారతి నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి

నల్లమాడ, ఆగస్టు 3: మండలంలో నర్సరీలు నిర్వహిస్తున్న యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, అందుకోసం దరఖాస్తులు చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని నర్సరీలను పరిశీలించారు. ఏ నర్సరీలూ అనుమతులు పొందలేదని, అందరూ అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గతంలో కూడా ఒకసారి నోటీసులు అందించామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. అనుమతులు లేకుండా నర్సరీలు కొనసాగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు షావ్వాజ్, లోకేష్, వినోద్, శిరీషా, స్వరూపా ఉన్నారు.



నర్సరీ యజమానికి నోటీసు ఇస్తున్న అధికారి

శభాష్ ముబారక్

● 13 ఏళ్లకే విభిన్న సైకిల్ తయారీ ● ప్రశంసించిన పరిటాల శ్రీరామ్ ● సైకిల్‌కు మోటార్, బ్యాటరీ అందజేత



ముబారక్‌ను సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, ఆగస్టు 3 : పట్టణంలోని 19 వార్డుకు చెందిన ముబారక్ 13 ఏళ్ల వయస్సులోనే విభిన్న రీతిలో సైకిల్ తయారు చేసి అందరిచేత శభాష్ అనిపించు కున్నాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఇటీవల ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన హాకీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి వెళ్లాడు. ఆ సమయంలో ముబారక్ తయారు చేసిన సైకిల్ ఆ గ్రౌండ్‌లో పరిశీలిం చాడు. ప్రత్యేక పార్టులతో విభిన్నంగా తయారు చేసిన ఆ సైకిల్‌ను గుర్తించి ముబారక్‌తో మాట్లాడారు. ఎలా తయారు చేశావు.. ఇంకా ఈ సైకిల్‌కు ఏవైనా పరికరాలు అవసరమా.. అని ఆరా తీశాడు. ముబారక్ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువును మధ్యలో వదిలేసి ఆటో మెకానిక్ షాపులో పనిచేస్తున్నానని, విభిన్నంగా సైకిల్‌ను తయారు చేయాలని భావించి తనకున్న తెలివితో ఇలా పాత పార్టులతో తీసుకుని సైకిల్‌ను తయారుచేశానని అన్నారు. దీనికి మోటార్, బ్యాటరీ కావాలని, అందుకు ఆర్థిక పరిస్థితులు బాగలేక తెచ్చుకోలేక పోయానని వివరించాడు. స్పందించిన పరిటాల శ్రీరామ్ వాటిని బెంగుళూరు నుంచి తెప్పిస్తానని హామీ ఇచ్చాడు. మోటర్, బ్యాటరీని తెప్పిం చిన శ్రీరాం.. శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లో ముబా రక్ ఇంటికి వెళ్లి వాటిని అందించాడు. అంతేకాకుండా ముబారక్ సన్మానించాడు. భవిష్యత్తులో ఏ అవసరమున్నా తనను సంప్రదించాలని, కొత్తప్రయోగాలకు చేయూతను అందిస్తానని భరోసా కల్పించారు. దీంతో ముబారక్ తల్లిదండ్రులు శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నాయకులు

కదిరి అర్బన్ , ఆగస్టు 3 : కదిరి డిపోలో రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరు ద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్ట ణంలోని డిపో ఎదుట విద్యా ర్థులతో ఆందోళన చేపట్టారు. వీరికి కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మద్దతు పలికారు. వారు మాట్లాడు తూ... విద్యార్థులకు బస్సు పాసులు మంజూరు చేశారేకానీ, అందుకు తగినట్లు బస్సులు నడపడం లేదని వాపోయారు. దీంతో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు సకాలంలో రాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరైన రవాణా సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు చదువులు మానేసే పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించలేదని, దీంతో ఈ ఆందోళన చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, శ్రీనివాసులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఉపేంద్ర పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన విద్యార్థినులు



విజేత విద్యార్థినులతో పాఠశాల సిబ్బంది

కదిరి, ఆగస్టు 3 : ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. లాంగ్‌జంప్‌లో బి. అర్చన, షాట్‌పుట్‌లో గంగోత్రి, వందమీటర్ల పరుగు పందెంలో బి. అర్చన, రెండ వందల మీటర్ల పరుగు పందెంలో సాయిప్రియ ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానో పాధ్యాయుడు వెంకటాచలం, పీడీ శంకర్‌నాయక్ తెలిపారు. వీరు అనంతపురం లో నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారు. వారిని ఉపాధ్యాయులు యశోద, సుజాత అభినందించారు.

అలరించిన సత్యసాయి గానామృతం

పుట్టపర్తి, ఆగస్టు 3 : తూర్పుగోదావరి జిల్లా భక్తులు సత్యసాయి గానామృతం పేరిట శనివారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సంగీత గానకచేరి నిర్వహిం చారు. గంట పాటు వాయిద్య గానాన్ని చేపట్టారు. అంతకు మునుపు సత్యసాయి అష్టోత్తర పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



గీతాలు ఆలపిస్తున్న భక్తులు

పాఠశాలలో నిరుపయోగంగా వాటర్ ఫిల్టర్



తనకల్లులో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్

తనకల్లు, ఆగస్టు 3 : స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఏడాదిగా నూతన వాటర్ ఫిల్టర్ నిరుప యోగంగా పడిఉంది. ఈ పాఠశాలలో 412 మంది విద్యార్థులున్నారు. వీరందరికి మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలలో వండి, వడ్డిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని ఇవ్వాలన్న సదుద్దేశంతో ప్రభుత్వంఈ వాటర్ ఫిల్టర్‌ను ఏడాది క్రితం మంజూరు చేసింది. అయితే ఇంతవరకు సంబంధిత ఉపాధ్యాయులు ఆ వాటర్ ఫిల్టర్ అమర్చాలన్న విషయాన్ని పట్టించుకోలేదు. దీంతో అది దిష్టిబొమ్మలా ఉండిపోయింది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో బోరు నీటినే పట్టుకుని తాగాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. వాటర్ ఫిల్టర్‌ను వినియోగంలోకి తెచ్చి.. విద్యార్థులకు శుద్ధ తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామాలకు డంపింగ్‌యార్డు పొగ

• రోగాల బారిన ప్రజలు • మంత్రి సత్యకుమార్ చొరవ చూపాలని వినతి

ధర్మవరం రూరల్, ఆగస్టు 3 : మండలంలోని మల్లేనిపల్లి వద్ద ఉన్న మున్సిపాలిటీ డంపింగ్ యార్డు నుంచి కాలుష్య పొగ వెదజల్లుతోంది. ఆ పొగ గ్రామాలను కమ్మేస్తుండంతో గ్రామీణులు రోగాల బారిన పడుతున్నారు. ఈ డంపింగ్ యార్డుకు ధర్మవరం మున్సిపాలిటీలోని చెత్తచెదారాన్ని తరలిస్తుంటారు. ఈ చెత్తచెదారానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలుష్యం పొగ ఏర్పడుతోంది. ఆ పొగ వల్ల మల్లేనిపల్లి, తుమ్మల, తిప్పేపల్లి గ్రామప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఊపిరి తిప్పుకోలేక పోతున్నారన్నారు. వీటిపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా డంపింగ్ యార్డును గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డంపింగ్‌యార్డులో చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం



డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ



ఆవేదన వ్యక్తం చేస్తున్న తుమ్మల గ్రామస్థులు

ఇంకా నిద్రలోనే 'ఆర్‌బీకే'..!



కొత్తచెరువు : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అయినా.. మండలంలోని తలమర్లలోని ఆర్‌బీకే కేంద్రంలోని ఉద్యోగులు, సిబ్బంది ఇంకా నిద్ర మత్తులోనే ఉన్నారు. గత ప్రభుత్వం ఆర్‌బీకే కేంద్రాలకు డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం అనే పేరు పెట్టింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా మార్చాలని ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటికీ తలమర్లలోని ఆర్‌బీకేకు ఆ శాఖ అధికారులు పేరు మార్చలేదు. వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రంగానే దర్శనమిస్తోంది.



సీఎంను కలిసిన పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

సీఎంకు పంచాయతీ రాజ్ చాంబర్ సభ్యుల వినతి

తాడిమర్రి, ఆగస్టు 3 : కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధులన్నీ గత వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, వాటిని రికవరీ చేసి.. గ్రామాల అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ రాజ్ చాంబర్ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారు విజయవాడలో ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆ చాంబర్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, అనంతపురం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ తెలిపారు. ఉపాధి హామీ నిధులు, ఎస్‌డీఎఫ్, నీరు-చెట్టు బకాయిలను విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. ఇప్పుడు గ్రామ పంచాయతీల్లో వీధిలైట్లు వేయాలన్నా నిధులు లేవని, మూడేళ్లుగా ఇదే దుస్థితి ఉందని వివరించామన్నారు. అదేవిధంగా సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవవేతనం పెంచాలని కోరినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో సర్పంచ్‌లు సుబ్బరామయ్యశెట్టి, మునిరెడ్డి, ధనుంజయయాదవ్, రాజు, వసుధ ఉన్నారన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

ధర్మవరం, ఆగస్టు 3: జిల్లాలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు. జిల్లాలో అంగన్‌వాడీ, ఐకేపీ, ఫీల్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం, మున్సిపల్ ఇంజనీరింగ్ రంగాల కార్మికులపై అధికార పార్టీకి సంబంధించిన కొందరు అనవసరంగా ఫిర్యాదులు చేస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వీటిని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : కలెక్టరేట్ వద్ద సోమవారం తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయా లని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ .. అక్రమ వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ, ఆశీర్వదమ్మ, సీఐటీయూ శ్రీరాములు, కుళ్లాయప్ప, శ్రీనివాసులు, శ్రీకాంత్, నాగరాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, ఫీల్డు అసిస్టెంట్లు, ఆశలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, చిరుద్యోగులు, మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ వెంకటేష్ కోరారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం కార్యదర్శి గోవిందు, అంగన్‌వాడీ కార్యకర్త రంగమ్మ, కమలమ్మ, లక్ష్మీదేవి, మేరీసూజాత, అరుణ, రత్నమ్మ, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వం

పుట్టపర్తి, ఆగస్టు 3: దేశంలో కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతు సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య విమర్శించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు కొమ్ముకాస్తోందన్నారు.పేదలు, రైతులు పక్షాన నిలిచి నిరంతరం పోరాటం చేయడంలో సీపీఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, మహదేవ్, దాదాపీర్ పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలపై ఆరా

ముదిగుబ్బ,ఆగస్టు 3 : స్థానిక బాలిక పాఠశాలను టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ శనివారం పరిశీలించారు. అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలలో పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగులు పాఠశాల సమీపంలోకి వస్తున్నాయని, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంఈఓ రమణప్ప, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిటాల శ్రీరామ్ సమక్షంలో మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

16న రాతిదూలం లాగుడు పోటీలు

ముదిగుబ్బ, ఆగస్టు 3 : ముదిగుబ్బ పాతూరులో ఈ నెల 16న రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు కోట్ల బాబి తెలిపారు. శనివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. ఈ పోటీలలో భాగంగా ఒక కాడికి 15 నిమిషాల సమయం ఉంటుందని, ఆ సమయంలో గెలుపొందిన ఎద్దులకు తొమ్మిది రకాల బహుమతులు ఇస్తామన్నారు. మొదటి బహుమతి 30 వేలు, రెండో బహుమతి 25 వేలు, మూడో బహుమతి 20 వేలు, నాల్గో బహుమతి 15 వేలు, ఐదో బహుమతి 10 వేలు, ఆరో బహుమతి 8 వేలు, ఏడో బహుమతి 6 వేలు, ఎనిమిదో బహుమతి 4 వేలు, తొమ్మిదో బహుమతి 2 వేలు చొప్పున అందిస్తామన్నారు. ఈ పోటీలలో జెర్సీ ఎద్దులకు అనుమతి లేదన్నారు. పోటీలలో పాల్గొనేవారందరికి అన్నదానం ఉంటుందని తెలిపారు.

కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, ఆగస్టు 3 : పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మికసంఘం సభ్యులు మృతుని ఇంటికి వెళ్లి... కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో ఆ సంఘం ప్రసిడెంట్ ముక్తం ఈశ్వరయ్య, సభ్యులు యంబాలింగన్న, ముక్తం మణిదీప్, సంకుసుధాకర్, మాబువాలి, గోవిందు ఉన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

కదిరి అర్బన్, ఆగస్టు 3: స్థానిక కుటాగుళ్ల, వీర్పుకాలనీ, మశానంపేట, జొకపాళ్యం మున్సిపల్ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయా పాఠశాల లో ఉపాధ్యాయులతో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ గోపాల్ నాయక్, ఆసీఫ్, రవినాయక్, శంకర్‌నాయక్, వీరమహేశ్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా ముళ్లకంపలు

కొత్తచెరువు, ఆగస్టు 3: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌కు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను రైల్వే అధికారులు తొలగిస్తున్నారని, అయితే వాటిని పూర్తిగా తొలగించకుండా వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆ ముళ్ల కంపలను పూర్తిగా తొలగించి తమకు ఇబ్బందులు కలగకుండా చూడాలని గ్రామానికి చెందిన రైతులు హేమాద్రి, మురళి, శివ, నాగేంద్ర, శ్రీనివాసులు కోరుతున్నారు.



ముళ్లకంపలను అడ్డుగా వేస్తున్న సిబ్బంది

కలెక్టరు, ఎస్పీలకు సన్మానం

పుట్టపర్తి/రూరల్ ఆగస్టు 3: జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి పర్యటనను విజయవంతం చేయడంపై కలెక్టరు టీఎస్ చేతన్, ఎస్పీ రత్నను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వేర్వేరుగా సన్మానించారు. వారు శనివారం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టరును సన్మానించారు. అనంతరం జేసీ అభిషేక్ కుమార్‌ను వారి కార్యాలయాల్లో కలిసి సన్మానించారు. అలాగే ఎస్పీని క్యాంప్ ఆఫీస్‌లో కలిసి సన్మానించారు. వీరి వెంట స్థానిక టీడీపీ నాయకులు రాజుయాదవ్, వెంకటేష్ యాదవ్, సామకోటి ఆదినారాయణ, కిరణ్‌యాదవ్ సాయిప్రసాద్ యాదవ్, గంగప్ప ఉన్నారు.



కలెక్టరు చేతన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

పేకాట స్థావరంపై దాడులు

● 15 మంది అరెస్టు.. రూ.17 లక్షలు స్వాధీనం

పెనుకొండ రూరల్, ఆగస్టు 3: కియ ఇండస్ట్రియల్ స్టేషన్ పోలీసులు పేకాట స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని కొండంపల్లి, శెట్టిపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.17.10 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్‌లు, 5 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో బెంగళూరు, కర్నూలు జిల్లావాసులు ఉన్నారని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా తెలిపారు. నిర్వాహకుడు రవి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు.

నేడు చౌడేశ్వరి జయంతి

హిందూపురం అర్బన్, ఆగస్టు 3: తొగటవీర క్షత్రీయ ఆరాధ్యదైవం చౌడేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించనున్నట్లు ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ తెలిపారు. శ్రావణమాసం మొదలవగానే వచ్చే మొదటి అమావాస్య రోజు అమ్మవారి జయంతి నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. శనివారం రాత్రి నుంచి హోమాలు చేపడతామన్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు ఆదిపరాశక్తి చౌడేశ్వరీదేవికి పంచామృతాభిషేకం, 7 గంటలకు కలశార్చన, గణపతి, నవగ్రహ , వాస్తు , సుదర్శన హోమాలు నిర్వహిస్తామన్నారు. చౌడేశ్వరీ దేవి చండీ హోమం, మహాబలి, గోపూజ, సుహాసిని పూజ, ఉదయం 11.34 గంటలకు మహాపూర్ణాహుతి, మహా మంగళహారతి అన్నదానం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు శివబాలయోగి స్వామి ఆశ్రమం నుంచి మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దేవి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రాజ్యలక్ష్మి

హిందూపురం, ఆగస్టు 3: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే బంగారు భవిష్యత్తు నాశనం చేసుకున్నవారవుతారని న్యాయాధికారి రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం ఎంజీఎం పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాగింగ్ జోలికి వెళ్లరాదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ ఇందాద్, బార్‌అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాది కళావతి, సంతోష్‌కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి : టీడీపీ



నాగోనపల్లిలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గుడిబండ, ఆగస్టు 3 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పేదలకు అందిస్తున్న నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడిబండలో రేషన్ పంపిణీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు డీలర్లు సక్రమంగా సరుకులు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుర్గేష్, శివకుమార్, మంజునాథ్, భీమరాజు, డీలర్లు జనార్దన్, నాగరాజు, శశిధర్, ప్రకాశ్, షబ్బీర్, శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

రొళ్ల : మండలంలోని మల్లినమడుగు, హెచ్.టి.హళ్లి గ్రామాల్లో రేషన్ పంపిణీని టీడీపీ నాయకులు ప్రారంభించారు. నూతన డీలర్ మల్లినమడుగు రమేష్, హెచ్.టి.హళ్లి సురేష్‌ల రేషన్‌షాపులను వారు ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి , మండల సీనియర్ నాయకులు గురుమూర్తి, నారాయణప్ప, బాలకృష్ణ, రంగనాథ్, భరత్, వెంకటేష్, రామకృష్ణ, యంజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామపంచాయతీ నాగోనపల్లి గ్రామంలో నూతన రేషన్‌షాపును డీలర్ జయన్న ప్రారంభించారు. హలుకూరు పంచాయతీ పరిధిలో ఉండే కాచికుంట గ్రామంలో నూతన రేషన్‌షాపును డీలర్ నాగరాజు ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

కల్వర్టు తెగిపోవడంతో ఇబ్బందులు

అగళి, ఆగస్టు 3 : మండలంలోని ఇరిగేపల్లి గ్రామం వద్ద కల్వర్టు తెగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ లక్ష్మమ్మ పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షానికి కల్వర్టు తెగిపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కల్వర్టు తెగిపోవడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందన్నారు. అనుమనపల్లి గ్రామం దగ్గర కల్వర్టు తెగిపోయింది. దానికి కూడా మరమ్మతులు చేపట్టలేదు. మరమ్మతులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలని ఆమె కోరారు.



ఇరిగేపల్లి వద్ద తెగిన కల్వర్టు

బడిలో ఎన్నికల సందడి



● ఎస్ఎంసీ చైర్మన్ కోసం తీవ్ర పోటీ ● 256 స్కూళ్లకు నోటిఫికేషన్ ● 5న అభ్యంతరాలు, 8న ఎన్నికలు



ఎంపీఎం పాఠశాల

హిందూపురం, ఆగస్టు 3 : సార్వత్రిక ఎన్నికలు ముగిసిన రెండు నెలల్లోనే పల్లెల్లో మరో ఎన్నికలకు సిద్ధమయ్యారు. హిందూపురం నియోజకవర్గంలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా 8న ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఎన్నికలకు నాలుగు రోజులే గడువు ఉండటంతో అధికార పార్టీలో ఎస్ఎంసీ చైర్మన్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే పదవి ఆశిస్తున్న నాయకులు అధికార పార్టీ ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాల ఎన్నికల్లో గట్టిపోటీ తప్పేలా లేదు. అయితే అధికార పార్టీ నాయకుల మధ్య తీవ్ర పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు సభ్యులు ఉంటారు. ఇప్పటికే ఆశావహులు విద్యార్థుల తల్లిదండ్రుల ఇండ్ల వద్దకు వెళ్లి మద్దతు కోరుతున్నారు.

చైర్మన్ పదవికి పెరిగిన పోటీ

గత ప్రభుత్వ హయాంలో పాఠశాల అభివృద్ధి పేరుతో నాడు నేడు పనులను పెట్టారు. కానీ వందకు ఒకటి రెండు కూడా పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తారని, వాటితో పనులు పూర్తి చేయవచ్చని పలువురు ఆశిస్తున్నారు. దీంతో చైర్మన్ పదవికి పోటీ మరింత పెరిగింది. ఉన్నత పాఠశాలల్లో పోటీ మరీ తీవ్రంగా ఉంది. చైర్మన్ పదవికి కొన్నిచోట్ల పది మంది దాకా బరిలో దిగుతున్నట్లు సమాచారం.

కేజీబీవీకి మరీ..

ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేస్తామని కార్పొరేట్ విద్యను అందిస్తామని చెప్పడంతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు అధికం కావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై మొగ్గు చూపుతున్నారు. ఇక ఏపీఆర్ఎస్ , కేజీబీవీ పాఠశాలల్లో అయితే సీటు దొరకాలంటే మంత్రుల సిఫార్సు లేఖలు ఇచ్చినా దొరకడంలేదు. ఇలాంటి పాఠశాలలకు చైర్మన్‌గా ఉంటే ఎంతో కొంత పేదలకు సాయం చేయవచ్చన్న ఆలోచన వారిలో ఉంది. కొన్నిచోట్ల అయితే అధికార పార్టీకి చెందిన నాయకులు, మండల స్థాయి నాయకులు సైతం పోటీ పడుతున్నారు.

256 స్కూళ్లకు ఎన్నికల నోటిఫికేషన్

హిందూపురం నియోజకవర్గంలో పట్టణం, మండలంతోపాటు లేపాక్షి, చిలమత్తూరు ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో 21, ప్రాథమిక పాఠశాలలు 80, ప్రాథమికోన్నత 16, రెసిడెన్సియల్ 3 పాఠశాలలు ఉన్నాయి. లేపాక్షి మండలంలో 58పాఠశాలలు ఉండగా ఉన్నత 8, ప్రాథమికోన్నత 5, ప్రాథమిక 43, ఏపీఆర్ఎస్, కేజీబీవీలు, చిలమత్తూరు మండలంలో 59పాఠశాలలు ఉండగా ఉన్నత 8, ప్రాథమికోన్నత 8, ప్రాథమిక 59 పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటికి నోటిఫికేషన్ విడుదలైంది.

ఎన్నికలు జరిగేది ఇలా..

ప్రభుత్వం జారీచేసిన నిబంధనల ప్రకారం ప్రతి తరగతి గది నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులను ఎన్నుకుంటారు. ఇందులో ఎస్సీ, బీసీ, ఓసీ, రిజర్వేషన్‌తోపాటు కచ్చితంగా ఇద్దరు మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులుంటే, మొత్తం 15 మందిని ఎన్నుకుంటారు. ప్రాథమికోన్నత పాఠశాలలో అయితే 21మందిని 6నుంచి 10వ తరగతి వరకు ఉంటే 15మంది కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియకు ముందే విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలో సమావేశపరిచి అభిప్రాయాన్ని సేకరిస్తారు. ఆ తరువాత ఈనెల 5న విద్యార్థుల తల్లిదండ్రుల ఓటరు జాబితాను పాఠశాలలో బోర్డుపై ఉంచుతారు. ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని తొలగిస్తారు.

8న ఎన్నికలు

ఈనెల 8న పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం ప్రతి తరగతినుంచి ఎన్నుకున్న సభ్యులతో మధ్యాహ్నం 2గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరుగుతుంది. అనంతరం వారి చేత ప్రమాణస్వీకారం చేయిస్తారు. వీరి పదవికాలం రెండేళ్లపాటు ఉంటుంది. ఎన్నుకోబడిన వారు పాఠశాల అభివృద్ధి నిర్వహణ విద్యాప్రమాణాలు పెంచి నగదుకు సంబంధించిన లావాదేవీలు చైర్మన్, హెచ్‌ఎం సంతకాలతో జరుగుతాయి.

ఎక్స్ అఫిషియో సభ్యులు

పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ సభ్యులతోపాటు ఆ పాఠశాలకు సంబంధించిన హెచ్‌ఎం సీనియర్ ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త ఏఎన్‌ఎం, మునిసిపాలిటీలో అయితే కౌన్సిలర్, పంచాయతీలో అయితే వార్డు మెంబర్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం : ఎంఈఓ

చిలమత్తూరు : ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని ఎంఈఓ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల కమిటీ ఎన్నికలకు సంబంధించి హెచ్‌ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు.

కలెక్టర్, ఎస్పీకి సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, ఆగస్టు 3 : జిల్లా కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా ఎస్పీ రత్నలను శనివారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సత్కరించారు. పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వారిని శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన విజయవంతం చేయడానికి ఎంతో శ్రమించారని వారిని ప్రత్యేకంగా అభినందించారు. వారం రోజులపాటు గ్రామంలోనే ఉండి ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో చిన్న తప్పిదానికి తావులేకుండా ఎంతో సమర్థవంతంగా విజయవంతం చేశారని వారు ప్రశంసించారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని, అవి పూర్తి అయ్యేందుకు సహకారం అందించాలని వారు కోరారు.



ఎస్పీ రత్నను సత్కరిస్తూ..

వక్కమార్కెట్‌కు స్థల పరిశీలన



స్థానికులతో వివరాలు సేకరిస్తున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

మడకశిర(అమరాపురం), ఆగస్టు 3 : వక్క మార్కెట్ నిర్మాణానికి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. అమరాపురం మండల పరిధిలోని హలుకూరు పంచాయతీ ఉండే ఉదుగూరు గ్రామంలో చింతతోపు దగ్గర ఉన్న 9.50 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు త్వరితగతిన వక్కమార్కెట్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. గత తెలుగుదేశం పార్టీ హయంలో అమరాపురం కేంద్రంగా వక్క మార్కెట్ నిర్మాణానికి జీఓనెంబర్ 301 మంజూరు చేస్తూ అప్పట్లోనే రూ.3.66కోట్ల నిధులను కేటాయించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వక్కమార్కెట్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఈకార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, రెవిన్యూ సిబ్బంది ఆర్ఐ మూడ్లగిరియప్ప, వ్యవసాయ అధికారి మంజునాథ్, సర్వేయర్, సచివాలయ సిబ్బంది, మండల సర్వేయర్ గణేష్, నాగోనహళ్లి మంజునాథ్, మల్లికార్జున, వాల్మీకి జిల్లా కన్వీనర్ మంజునాథ్, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, టీఎన్‌టీయూసీ తాలూకా ఉపాధ్యక్షులు రామచంద్రప్ప, మాజీ సర్పంచులు ప్రకాష్, శకునప్ప, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలతో సంపూర్ణ ఆరోగ్యం

● తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు ● కొనసాగుతున్న వారోత్సవాలు



మొరంపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



అమరాపురంలో...

చిలమత్తూరు, ఆగస్టు 3: ప్రకృతిలో సంపూర్ణమైన ఆహారం తల్లిపాలేనని ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ సునీతబాయి పేర్కొన్నారు. మండలంలోని మొరంపల్లిలో తల్లిపాల వారోత్సవాన్ని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను చాటిచెప్పారు. తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఆహారంగా ఇవ్వాలన్నారు. తల్లి పోషకాహారం తీసుకుంటేనే బిడ్డకు అవసరమైన పాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్, అంగన్‌వాడీ కార్యకర్త జయమ్మ, ఏఎన్‌ఎం పార్వతి తదితరులు ఉన్నారు.

హిందూపురం(సోమందేపల్లి) : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై చల్లాపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ హరికుమార్, ఓం కార్ పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని, వాటిని తప్పనిసరిగా తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, రవీంద్ర, రత్నమ్మ, మదుబాబు, అశ్విని, ప్రభాకర్ రాజు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అగళి : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. అగళి మండలం ఎంపాళెం గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ జయమ్మ, శిరీష, రమామణి, నరసమ్మ, శోభ, శిల్ప, సావిత్రమ్మ, రంగమ్మ, ఆశ వర్కర్లు, ఆయాలు తల్లులు పాల్గొన్నారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలతో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నాగమణి, జ్యోతి, అనసూయ, రాజమ్మ, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని వడిగేపల్లిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు, తల్లులు గ్రామస్తులు వైద్య సిబ్బంది ఫ్లకార్డులు ప్రదరిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషాద్రి. నాగభూషణరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, ఏఎన్‌ఎం శకుంతల, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, కార్యదర్శి దీపక్, వెల్ఫేర్ అసిస్టెంట్ మధన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులున్నారు.



వడిగేపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

రోడ్డుపై కూలిన స్తంభం



హిందూపురం అర్బన్, ఆగస్టు 3: నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో విద్యుత్ స్తంభం కూలింది. ఈ సమయంలో జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శనివారం తెల్లవారుజామున పట్టణంలోని ప్రధాన రహదారి అంబేద్కర్ సర్కిల్ నుంచి పెనుకొండ వైపు వెళ్లే ఇందిరమ్మ సర్కిల్‌లో ఈ ప్రమాదం జరిగింది. పట్టణ ప్రణాళికా విభాగం మున్సిపాలిటీకి చెందిన విద్యుత్ దీపాలు వెలిగే ఐరన్ స్తంభం ఉన్నఫళంగా కూలిపోయింది. ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పాడైపోయిన, పాత స్తంభాలను మార్చాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న విద్యుత్ స్తంభం

పర్యావరణాన్ని కాపాడుకుందాం



పెనుకొండ రూరల్, ఆగస్టు 3 : విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంఈఓ సుధాకర్ పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తిమ్మాపురంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు లక్ష్మీబాయి, పీవీవీ కార్యకర్త నరసింహులు, హరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టెంపో బోల్తా..ఒకరి మృతి

● గొర్రెలు తరలిస్తుండగా ప్రమాదం ● 25 జీవాలు మృతి



బోల్తా పడిన టెంపో, మృతి చెందిన నారాయణప్ప

మడకశిర రూరల్, ఆగస్టు 3 : గొర్రెలు తరలిస్తున్న టెంపో వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందారు. శనివారం మండలంలోని మణూరు , ఎం రంగాపురం గ్రామాల నుంచి గొర్రెలు తీసుకెళ్తున్న టెంపో కర్ణాటకలోని కోరటగేరి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నారాయణప్ప(60) మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. 25 గొర్రెలు కూడా మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. ఆ రెండు గ్రామాలకు చెందిన నారాయణప్ప, లక్ష్మీనారాయణ, అంజన్న, నారాయణప్ప, చంద్రప్ప ఉదయం టెంపోలో 80 గొర్రెలను కర్ణాటకలోని రాంపురం సంతకు తరలిస్తున్నారు. వేగంగా వెళ్తున్న టెంపో కోరటగేరి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నారాయణప్ప అక్కడిక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 25 గొర్రెలు కూడా మృతి చెందాయి. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లేపాక్షి, ఆగస్టు 3: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది నిద్ర మాత్రలు మింగిన ప్రమీల(30) అనే మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కల్లూరు గ్రామానికి చెందిన చిన్నప్పయ్య ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఈమె భార్య ప్రమీల, కుమారుడు ఉన్నారు. ఇటీవల కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతుండేవి. విరక్తి చెందిన మహిళ శుక్రవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అనంతపురంలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నలుగురి అరెస్ట్

గోరంట్ల, ఆగస్టు 3: పోలీస్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డిపై జరిగిన దాడి కేసులో గోరంట్లకు చెందిన ఎరుకుల వంశీ, విజయ్‌చందు, వేపచెర్ల మహేష్, బాబ్‌జాన్లను శనివారం అరెస్టుచేసినట్లు ఏఎస్ఐ ధనుంజయ రెడ్డి తెలిపారు. జన్మదిన వేడుకలు జరుపుకుని మత్తులో మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. సంఘటన అనంతరం పరారీలో ఉన్న పై నలుగురు నిందితులను గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు

హిందూపురం(సోమందేపల్లి)ఆగస్టు 3: మండల పరిధిలోని గుడ్డం నాగేపల్లికి చెందిన ఉప్పరహరీష్, మరికొందరు శనివారం వైసీపీ నాయకులు తమను బెదిరిస్తున్నారని బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన జలధి వేడుకల్లో టీడీపీ, వైసీసీ వర్గీయుల మధ్య చిన్నపాటి ఘర్షణ రేగిందన్నారు. ఉప్పర రాజప్ప, చాలకూరుకు చెందిన నవీన్‌తో కలిసి తమపై బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. వారితో తమకు ప్రాణహాని వుందని రక్షణ కల్పించాలని పోలీసులను కోరామన్నారు. దీనిపై ఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని విచారణ చేస్తున్నామని వివరాలు వెల్లడిస్తామన్నారు.

విద్యార్థి కిడ్నాప్.. కాదు..కాదు సేఫ్

● బాలుడి అదృశ్యం అంటూ హైరానా

హిందూపురం అర్బన్, ఆగస్టు 3: ఓ పాఠశాలలో విద్యార్థి కనపడలేదని ఆందోళన చెందారు. కిడ్నాప్ అయ్యాడని హైరానా చేశారు. అయితే బాలుడు క్షేమంగా కనిపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శనివారం హిందూపురం పట్టణ పరిధిలోని వాసవీ ధర్మశాల రోడ్డులో వైద్యుడు సుప్రవీణ్ కుమారుడు ప్రీతమ్‌ను పాఠశాల నుంచి తీసుకెళ్లడానికి వచ్చారు. బాలుడు కనపడకపోవడంతో ఉపాధ్యాయులతో ఆరాతీశారు. పాఠశాలలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో మరింత ఆందోళన నెలకొంది. అయితే ప్రీతమ్, అతని స్నేహితుడు ఇద్దరూ కలిసి మరో చోటికి వెళ్లినట్లు తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, బాలుడి ఆచూకీ తేలడంతో వెనుదిరిగిపోయారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : గుండుమల

మడకశిర రూరల్, ఆగస్టు 3 : తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలో సుంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, మండల మాజీ కన్వీనర్ శంకరనారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గుండుమల ఆ గ్రామానికి వెళ్లి శంకరనారాయణ రెడ్డి మృతదేహంపై టీడీపీ జెండా, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ.క్లస్టర్ ఇన్‌చార్జీ నాగరాజు, కల్లుమర్రి సర్పంచ్ గంగమ్మ, తెలుగు యువత అధ్యక్షుడు మారుతి రెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

మడకశిరటౌన్, ఆగస్టు 3 : మడకశిర నగర పంచాయతీ ఏరియాలో శనివారం విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి అరగంటకోసారి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, ఉక్కపోతతో అల్లాడామని పట్టణ వాసులు వాపోయారు. గొల్లపల్లి సబ్‌స్టేషన్లో సమస్య రావడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడిందని సంబంధిత అధికారులు అంటున్నారు. 15 రోజులుగా మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, అధికారులు విద్యుత్‌సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడపిల్ల చదువు దేశానికే వెలుగు

హిందూపురం అర్బన్, ఆగస్టు 3: ఆడపిల్లల చదువుకుంటే దేశానికే వెలుగు అని ఎంఈఓ గంగప్ప, ఎంఈఓ -2 ప్రసన్నలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కళాశాల, తల్లిదండ్రులు, గురువులు దేశం గర్వపడేలా ఎదగాలన్నారు. అనంతరం గత సంవత్సరం మొదటి, రెండవ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు.

మోస్తరు వర్షం

గుడిబండ, ఆగస్టు 3 : మండలంలోని ఎస్.రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, మండలపల్లి, కొంకల్లు, తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వేరుశనగ, రాగి, కంది, ఉలవ సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరుణ దేవుడు కరుణిస్తే ఈ సారి మంచి పంటలు పండుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.